బుల్లికథ:

# అనగా అనగా....

రచన: రాజ శివకామేశ్వరరావు

అనగా, అనగా ఒకఊళ్లో ఒకరాజు ఉన్నాడు.

ఆరాజు చాలా ముసలివాడు. ఆరాజుకు ఇద్దరు కొడుకులు. ఇద్దరుకొడుకులూ యుక్తవయస్కులయినారు. ఇద్దరూ అందమైనవాళ్లూ బలపరాక్రమములు గలవారున్నూ. ఆ కొడుకుల బలపరాక్రమములుచూసి శత్రురాజులుకూడా దండెత్తి రావడానికి భయపడుతూంటారు.

ఇట్లావుండగా ఆ ఇద్దరు రాజకుమారులకూ ఒక ఆలోచన పుట్టింది. 'మనతండ్రి ముసలివాడైనాడు. ఇంకముందు మనమే రాజకార్యములు చూడవలసి ఉంటాము. అప్పుడు మనకు తీరిక దొరకదు. కాబట్టి ఒకపర్యాయము దేశాటనము చేసివద్దాము,' అనుకున్నారు. తమ ఉద్దేశాన్ని రాజుగారితో చెప్పారు. రాజుగారు 'సరే' అన్నారు. వెంటనే ఇద్దరు రాజకుమారులూ చెరొక గుర్రముమీదా మారువేషాల్తో దేశాటనకి బయలుదేరారు.

రాజకుమారులు దేశాటనకు బయలుదేరి వెళ్లారని గూఢచారులద్వారా ఒక శత్రురాజు తెలుసుకున్నాడు. వెంటనే తనకున్న సైన్యాన్ని సమకూర్చుకొని ఈరాజుమీదికి దండెత్తివచ్చాడు. శత్రురాజు అకస్మాత్తుగా దండెత్తిరావడం మూలాన్నూ కొడుకులు దగ్గరలేకపోవడంవల్లనూ, ఆ ముసలి రాజు యుద్ధంలో ఓడిపోయినాడు. రాజూ రాణీ అడవుల్లో తలదాచుకున్నారు.

అక్కడ దేశాటనకు బయలుదేరిన రాజకుమారులిద్దరూ మారువేషాల్తో దేశదేశాలూ తిరుగుతూ, ఒకరోజున ఒక అడవిగుండా పోతున్నారు. వాళ్లకి ఆ అడవిలో ఒక ఎండిపోయిన చెరువు కనుపించింది. ఆ చెరువులో కొద్దిగా బురదగా వున్న చోట ఒకచేప గిలగిల కొట్టుకుంటున్నది. రాజకుమారులు ఆ చేపను చూచారు. రాజుగారి పెద్ద కుమారుడు అడిగాడు. 'ఓచేపా, ఎందుకలా గిలగిల లాడుతున్నావూ?' అని. చేప 'అయ్యా, ఈ చెరువులో నీళ్లు ఎండిపోయినవి. దయయుంచి, నన్ను ఏ నీళ్లుగల కోనేరులోనన్నా దిగబెట్టితే మీకు చాలా పుణ్యము ఉంటుంది' అన్నది. రాజకుమారుడికి జాలిపుట్టింది. "ఆచేపను ఏ చెరువులోనన్నా దిగబెట్టుదాము" అనుకుని, ఆ చేపనుతీసి తనదగ్గరవున్న నీళ్ళచెంబులో వేసుకున్నాడు. తిరిగి రాజకుమారులిద్దరూ బయలుదేరారు. ఒక పట్టణం చేరుకున్నారు. ఆపట్టణంలో ఏదన్నా కోనేరు ఉన్నదేమోనని తిరగడం ప్రారంభించారు. తిరగ్గా తిరగ్గా ఒక పెద్దతోటలో ఒక పెద్దకోనేరు కనుపించింది. రాజుగారి పెద్దకొడుకు చేపనుతీసి కోనేట్లో వదిలిపెట్టాడు. చేప, రాజకుమారుడితో 'అయ్యా, మీరు నాకు చేసినసహాయమునకు చాలా కృతజ్ఞురాలను. మీకు ఏమయినా నా సహాయము కావలసివస్తే నన్ను స్మరించుకోండి. నేను వచ్చి మీకోరిక నెరవేరుస్తాను' అంది.

వెంటనే రాజకుమారుడి బుర్రలో ఏదో మెదిలింది. "నిన్ను స్మరించుకున్నంతమాత్రాన నువ్వు రాగలవా?" అన్నాడు చేపతో.

'ఓ! వస్తాను!' అంది.

రాజకుమారుడు ఆ చేపను అందిపుచ్చుకుని తిరిగి తన చెంబులో పడవేశాడు. అది భీభత్సంగా, అర్థంకాని చూపులు చూడటం మొదలెట్టింది.

రాజకుమారుడు గుడ్లురిమిచూస్తూ అన్నాడు— 'స్మరించినంతమాత్రాన రాగలిగే శక్తిగలదానివై యుంటే ఆ ఎండిపోయిన చెరువులోంచి ఇక్కడకు తెచ్చి పడవెయ్యమని ఎందుకు వేధించావు నన్నూ! పద! మళ్ళీ తీసుకెళ్ళి ఆ ఎండిపోయిన చెర్లోనే పడేస్తాను. నీ మహాత్యం ఉపయోగించి బ్రదుకు గాని...'

కథ కంచికీ మనం ఇంటికీ.

ఆకర్షణీయమైన రచనలకు ఆనందవాణి